క్లుప్తంగా

ఎలక్ట్రానిక్ మీడియా కార్యవర్గం ఎన్నిక



నూతన సభ్యులను సన్మానిస్తున్న సంఘం నాయకులు

షాద్‌నగర్: టీయూడబ్ల్యూజే(ఐజేయూ) షాద్‌నగర్ నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని బాబా దాబాలో ఏర్పాటు చేసిన సమావేశానికి సంఘం రాష్ట్ర మఫిషియల్ జర్నలిస్టు కమిటీ రాష్ట్ర కన్వీనర్ గుడుపల్లి శ్రీనివాస్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎలక్ట్రానిక్ మీడియా నియోజకవర్గ అధ్యక్షుడిగా నర్సింహ(ఎస్‌టీవీ), ఉపాధ్యక్షులుగా సలీం, శ్రీనివాస్, శివ, ప్రధాన కార్యదర్శిగా ఫయాజ్, సంయుక్త కార్యదర్శులుగా విష్ణు, రాజు, సాబేర్, కోశాధికారిగా రజాక్‌లు ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులను సంఘం నాయకులు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.

ఇళ్ల సర్వే సక్రమంగా నిర్వహించాలి

ఆర్డీఓ చంద్రకళ



ఇందిరమ్మ ఇళ్లపై మండల అధికారులతో చర్చిస్తున్న ఆర్డీఓ చంద్రకళ

మొయినాబాద్‌రూరల్: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను అధికారులు సక్రమంగా నిర్వహించి అర్హులైన వారిని గుర్తించాలని ఆర్డీఓ చంద్రకళ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించిన ఆమె మండల అధికారులతో పాటు మున్సిపల్ కమిషనర్ ఖాజామొయిజుద్దీన్‌తో ఇందిరమ్మ ఇళ్లపై చర్చించారు. ఈ సందర్భంగా చేవెళ్ల నియోజకవర్గానికి 3500ల ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. మొయినాబాద్ మండలంతో పాటు మున్సిపాలిటీ పరిధిలో 4వేల ఇళ్ల దరఖాస్తులు వచ్చాయన్నారు. అందులో ఇళ్ల స్థలాలు ఉన్న వారిని గుర్తించామని, మండల పరిధిలో 366, మున్సిపల్ పరిధిలో 337 ఎల్‌వన్‌గా నిర్ధారించామని పేర్కొన్నారు. ఈ నెల 30వ తేదీలోపు పై అధికారులకు సమర్పించేందుకు అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, మండల సూపరింటెండెంట్ రెహమాన్, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ డీకే అరుణ, నాయకులు

కేశంపేట: మండల కేంద్రంలో ఉన్న ఈరనాగమ్మ బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ హైదరాబాద్‌లో మంగళవారం ఆవిష్కరించారు. మండల కేంద్రంలోని ఈర నాగమ్మ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మే 15వ తేదీన పుట్టపూజ, 16న కల్యాణం నిర్వహిస్తామని దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ ఉత్సవాల్లో మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఆరెకటికలు అధిక సంఖ్యలో పాల్గొనాలని దేవాలయ కమిటీ సభ్యులు కోరారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి శివాజీ, నాగేశ్వర్, నరేశ్, మల్లేశ్, నర్సింగ్, రఘురాం, మధుసూదన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణులకు న్యాయం చేయాలని వినతి

మొయినాబాద్‌రూరల్: నాయీబ్రాహ్మణులకు న్యాయం చేయాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మండల నాయీబ్రాహ్మణులు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. మంగళవారం మంత్రి కార్యాలయంలో వారు మంత్రిని కలిసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా వినతి పత్రం అందజేస్తూ గత ప్రభుత్వ హయాంలో నాయీబ్రాహ్మణులకు ఉచిత కరెంటు అందించారని, ప్రస్తుతం తమను కరెంటు బిల్లులు కట్టాలని అధికారులు వేధిస్తున్నారని వివరించారు. మంత్రి స్పందిస్తూ కరెంటు బిల్లులకు ఎవరైనా వస్తే వాట్సాప్ కాల్ ద్వారా ఫోన్ చేయాలని తెలిపినట్లు వివరించారు. నాయీబ్రాహ్మణులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన హామీనిచ్చారని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో మంగలి నరేందర్, పి.రాజు, బాబురాజు, మంగలి మహేందర్ తదితరులు ఉన్నారు.

ఇంటర్ విద్యార్థుల ప్రభంజనం

- అన్ని కళాశాలల్లో బాలికలదే హవా
- అత్యధిక మార్కులతో సత్తాచాటిన మోడల్ విద్యార్థులు
- ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందన



శృతిలయ, ఎంపీసీ (468/470)



ఉషారాణి, బైపీసీ (972/1000)



సర్బజీత్, ఎంపీసీ (974/1000)



కె.భార్గవి, ఎంఈసీ (492/500)



పి.అక్షిత, సీఎస్‌సీ (968/1000)

చేవెళ్ల: ఇంటర్ పరీక్షల ఫలితాల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలలకు దీటుగా సత్తాచాటారు. మండల కేంద్రంలోని ఆదర్శ కళాశాలకు చెందిన విద్యార్థులు అన్ని గ్రూపుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఆదర్శ కళాశాలలో 68శాతం ఉత్తీర్ణత నమోదైంది. ద్వితీయ సంవత్సరంలో 142 మందికి గాను 81మంది, మొదటి సంవత్సరంలో 122 మందికి గాను 100 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల సిబ్బంది అభినందించారు. ఆదర్శ కళాశాలలో మొదటి సంవత్సరం ఎంపీసీ విద్యార్థిని శృతిలయ 470 మార్కులకు 468 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించింది. వికారాబాద్ జిల్లా రొంపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ కుటుంబానికి చెందిన ఈడిగి రవీందర్‌గౌడ్, పద్మల కూతురు శృతిలయ.పదో తరగతి వరకు మోడల్ స్కూల్ బంట్వారంలో చదివి, కళాశాల కోసం చేవెళ్ల ఆదర్శ కళాశాలలోని వసతి గృహంలో ఉంటూ చదువుకుంటోంది. విద్యార్థికి కళాశాల అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

చేవెళ్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫలితాల్లో పలువురు విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 67శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. కాగా మొదటి సంవత్సరంలో 54శాతం ఉత్తీర్ణత సాధించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు కళాశాల సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఫలితాలతో ఎంతో సంతోషంగా ఉందని చెబుతుంది. తాను చదువుకునేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల అందించిన ప్రోత్సాహంతోనే ఈ విజయం సాధించాను. వసతి గృహంలో ఉంటంతో చదువుకునేందుకు ఎక్కువ అవకాశం లభించింది. ద్వితీయ సంవత్సరంలో కూడా అత్యధిక మార్కులు సాధించుకుంటాను. ఇంజనీర్ కావాలనే లక్ష్యంతో చదువుతున్నాను. తమ కుతురు రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించటం ఎంతో సంతోషంగా ఉందని మాటలు రావటం లేదని ఆమె తల్లిదండ్రులు అంటున్నారు. విద్యార్థి ప్రతిభను చూసిసంతోషంతో కళాశాల అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

బైపీసీలో విద్యార్థి సత్తా



సిరి, బైపీసీ 987/1000

కొందుర్గు: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం బైపీసీలో కమ్మదనం గురుకుల కళాశాలలో చదువుతున్న రేగడిచిల్కమర్రి గ్రామానికి చెందిన కావలి సిరి 1000 మార్కులకుగాను 987 మార్కులు సాధించి సత్తాచాటింది. ఈ సందర్భంగా విద్యార్థి సిరిని గ్రామస్తులు అభినందించారు.

గురుకుల విద్యార్థుల సత్తా

మొయినాబాద్: ఇంటర్ ఫలితాల్లో గురుకుల విద్యార్థులు సత్తాచాటారు. మున్సిపాలిటీలోని చిలుకూరులో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 96శాతం ఉత్తీర్ణత సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.



ఎన్.శశికిరణ్, ఎంపీసీ (987/1000)



ఎ.సాయికుమార్, బైపీసీ (981/1000)



ఎండీ.జాఫర్, ఎంపీసీ (467/470)



వి.అభిరామన్ బైపీసీ (432/440)

మెరిసిన సిద్ధార్థ విద్యార్థులు

మొయినాబాద్: ఇంటర్ ఫలితాల్లో మొయినాబాద్‌లోని సిద్ధార్థ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఆంజనేయులు, కరెస్పాండెంట్ ఉమాకాంత్, డైరెక్టర్లు రామకృష్ణ, లింగం, అధ్యాపకులు అభినందించారు.

ప్రతిభ చాటిన విద్యార్థులు

అమ్డాపూర్ గ్రామానికి చెందిన తూర్పు ప్రణవిరెడ్డి శ్రీచైతన్య కళాశాలలో చదువుతూ ఫస్టియర్ ఎంపీసీలో 466 మార్కులు సాధించారు. అదేవిధంగా మొయినాబాద్‌కు చెందిన పట్లోళ్ల అనన్యరెడ్డి నారాయణ కళాశాలలో చదువుతూ బైపీసీలో 438 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పలువురు అభినందించారు.



ఎ.చర్విత, ఎంపీసీ (981/1000)



ఎ.శృతి, ఎంఈసీ (968/1000)



మహేశ్వరి,సీఈసీ (474/500)



హాదియా మొయిన్, సీఈసీ(457/500)



టీ.సంజన, ఎంపీసీ (453/470)



తూర్పు ప్రణవిరెడ్డి, ఎంపీసీ(466/470)



పట్లోళ్ల అనన్యరెడ్డి, బైపీసీ(438/440)

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న శ్రీనునాయక్

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్

షాద్‌నగర్: ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండలం కడియాలకుంట తండాలో ఉపాధి హామీలో పని చేస్తున్న కూలీలను వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనునాయక్ మాట్లాడుతూ.. రెక్కాడితే కాని డొక్కాడని కూలీలు ఎండలో పనిచేస్తున్నారని, వారికి తొమ్మిది వారాల నుంచి కూలీ డబ్బులు చెల్లించకపోవడంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే కూలీ డబ్బులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కూలీలకు కనీసం వంద రోజుల నుంచి 200 రోజులకు పని దినాలను పెంచాలని కోరారు. కూలీ రోజుకు రూ.800లు పెంచాలని, పని ప్రదేశాల్లో కూలీలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి జాబ్‌కార్డులు ఇవ్వాలని, కూలీల సమస్యలు పరిష్కరించకుంటే ఉపాధి కూలీలతో మండల పరిషత్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, దీప్లానాయక్, లింగంనాయక్, సంతోష్‌నాయక్, లో క్యా, ముత్యాలు, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

సీడీపీఓ షభానా

కేశంపేట: చిరుధాన్యాలతో కూడిన పోషకాహారం తీసుకోవడంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ షాద్‌నగర్ సెక్టార్ సీడీపీఓ షభానా అన్నారు. పోషణ్ పక్షోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిధిలోని నిర్దవెళ్లి, చౌలపల్లి గ్రామాల్లో పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నిర్దవెళ్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. పుట్టిన బిడ్డకు వెంటనే తల్లిపాలను తాగించాలని ఆమె సూచించారు. బాలింతలు, గర్భిణులు విధిగా పోషకాహారాలను తీసుకోవాలని తెలిపారు. శిశువులకు క్రమం తప్పకుండా టీకాలను వేయించాలని సూచించారు. చౌలపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో కొత్తపేట సెక్టార్ సూపర్‌వైజర్ సమంత పాల్గొని తగిన సూచనలు చేశారు. అనంతరం అర్హులైన మహిళలకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో కేశంపేట సెక్టార్ సూపర్‌వైజర్ దివ్యసింగ్, అంగన్‌వాడీ టీచర్లు జయమ్మ, మోహనమ్మ, ప్రేమలత, సులోచన, వనజాత, జయమ్మ, ఆశ కార్యకర్తలు అనిత, గీత తదితరులు పాల్గొన్నారు.



నిర్దవెళ్లిలో మాట్లాడుతున్న సీడీపీఓ షభానా

ఉపాధ్యాయురాలికి సన్మానం

మొయినాబాద్‌రూరల్: ఉద్యోగ రీత్యా విరమణ సహజమేనని, విద్యార్థులను ఉన్నత స్థాయికి ఎదగడానికి కృషి చేసిన ఉపాధ్యాయులను విద్యార్థులు ఎప్పుడు మరచిపోలేరని బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి, ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు యూ.పోచయ్య అన్నారు. మంగళవారం హిమాయత్‌నగర్ చౌరస్తాలోని విజయ్‌ఠాగూర్ ఫంక్షన్‌హాల్‌లో హిమాయత్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న పర్వతపల్లి కళావతి పదవీ విరమణ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంజనేయులు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఉద్యోగ విరమణ పొందుతున్న కళావతి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత అవార్డు పొందారని ఆమె సేవలను గుర్తుచేశారు. వివిధ పాఠశాలల నుంచి పెద్దఎత్తున ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, నాయకులు తరలివచ్చి కళావతి దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో మండల మాజీ విద్యాధికారి వెంకటయ్య, అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవియాదవ్, ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పోచయ్య, టీపీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు చెన్నయ్య, ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, మాజీ ఎంపీపీ పాండుగౌడ్, లక్ష్మారెడ్డి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి బడా బాబులే మిన్న

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: బీజేపీ ప్రభుత్వానికి పేద ప్రజల కంటే బడా బాబుల ప్రయోజనాలే మిన్నాగా మారాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'జైబాపు, జై భీమ్, జైసంవిధాన్' కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి కొందుర్గు ఎస్సీ కాలనీ వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా శ్రీరంగాపూర్ వద్ద షాద్‌నగర్ వ్యవసాయ కమిటీ మాజీ వైస్ చైర్మన్ సయ్యద్ సాదిక్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. కొందుర్గులో ఆయన మాట్లాడుతూ.. దేశానికి రాజ్యాంగాన్ని అందించిన అంబేడ్కర్ అంటే బీజేపీ ప్రభుత్వానికి గిట్టదన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకునే బాధ్యత భారతీయులందరిపై ఉందని గుర్తుచేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు పురుషోత్తంరెడ్డి, నరేందర్, యాదయ్య, రామయ్యగౌడ్, మల్లేష్ గౌడ్, గోవర్దన్ గౌడ్, జీబీ కృష్ణ, కృష్ణయ్య, శ్రీను, రవీందర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థుల ప్రతిభ

కేశంపేట: మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాటిగడ్డ గ్రామంలో ఉన్న కేజీబీవీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం బైపీసీలో 32 మందికిగాను 25 మంది, సీఈసీలో 51 మందికి 31 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో బైపీసీలో 39 మందికి 39 మంది, సీఈసీలో 35 మందికి 31 మంది ఉత్తీర్ణత సాధించారు. అదేవిధంగా కేజీబీవీలో మొదటి సంవత్సరం సీఈసీలో 37 మందికి 32మంది, ఎంపీహెచ్‌డబ్ల్యూలో 39 మందికి 39 మంది ఉత్తీర్ణత సాధించారు. అదేవిధంగా ద్వితీయ సంవత్సరం సీఈసీలో 37 మందికి 33 మంది, ఎంపీహెచ్‌డబ్ల్యూలో 39 మందికి 39 మంది ఉత్తీర్ణత సాధించినట్టు మండల విద్యాధికారి చంద్రశేఖర్ తెలిపారు.

మోడల్ విద్యార్థుల ప్రతిభ

శంకర్‌పల్లి: ఇంటర్ ఫలితాల్లో శంకర్‌పల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో మమత 417 మార్కులు, బైపీసీలో ధనూశ్ 329 మార్కులు, ఎంఈసీలో భార్గవి 479 మార్కులు సాధించారు. ఎంపీసీ సెకండీయర్ పి.సంజయ్ 817 మార్కులు సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ శోభారాణి అభినందించారు.



ధనూశ్ సీఈసీ (329/440)



మమత, ఎంపీసీ (417/470)



భార్గవి బైపీసీ (479/500)

బాలికలదే హవా

షాబాద్: ఇంటర్మీడియట్ ఫలితాల్లో బాలికలే పైచేయిగా నిలిచారు. మంగళవారం విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో షాబాద్ ఆదర్శ పాఠశాల(కళాశాల)లో బాలికలే మంచి ఫలితాలు సాధించి ముందు వరుసలో నిలిచారు. పాఠశాల (కళాశాల) ప్రిన్సిపాల్ కవిత వివరాలను వెల్లడించారు. ఇంటర్మీడియట్ రెండో సంవత్సరంలో విద్యార్థులు 72శాతం ఉత్తీర్ణత సాధించగా, మొదటి సంవత్సరంలో 66 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



పి.శ్రీజ, ఎంపీసీ 979/1000



ఎం.మానస, ఎంపీసీ 935/1000



హాసిని, ఎంపీసీ 918/1000



కె.మైథిలి, బైపీసీ 945/1000



జి.అక్షిత, బైపీసీ 920/1000



మధిహ కుబ్ర బైపీసీ 901/1000



వైష్ణవి, సీఈసీ 923/1000



కే.మహేశ్వరి, సీఈసీ 902/1000



ఎం.మహేశ్వరి, సీఈసీ 897/1000

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

కొందుర్గు: కొందుర్గు బాలుర ప్రాథమిక పాఠశాలలో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆధ్వర్యంలో 5వ తరగతి పూర్తిచేసుకున్న విద్యార్థులకు వీడ్కోలు పలికారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఎంతగానో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల భవనానికి రూ.1.50లక్షల ఖర్చుతో గ్రిల్స్ ఏర్పాటు చేసిన సర్వ ప్రేమ వెల్ఫేర్ సొసైటీ సంస్థ డైరెక్టర్ సరితను పాఠశాల తరఫున శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం గోపినాథ్, హెచ్‌ఎం రాధాకృష్ణ, మాజీ వైస్ ఎంపీపీ రాజేశ్‌పటేల్, గ్రామస్తులు సుధాకర్ గౌడ్ పాల్గొన్నారు.



గ్రాడ్యుయేషన్ డే లో ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఇంద్రారెడ్డి ఆశయాలు సాధిస్తాం

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి

మొయినాబాద్: ఇంద్రారెడ్డి కుటుంబానికి రాజకీయ జీవితాన్ని ఇచ్చింది చేవెళ్ల ప్రజలేనని, నియోజకవర్గ ప్రజలకు తమ కుటుంబం రుణపడి ఉందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. మాజీ హోంమంత్రి దివంగత ఇంద్రారెడ్డి వర్ధంతి సందర్భంగా మొయినాబాద్ మున్సిపల్ కేంద్రంతో పాటు చిలుకూరు, మండల పరిధిలోని రెడ్డిపల్లిలో ఇంద్రారెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంద్రారెడ్డి ఆశయ సాధనకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. రాజకీయంగా నిలబెట్టిన చేవెళ్ల ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటామన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి ఇంద్రారెడ్డి కుటుంబం ఎంతో కృషి చేసిందన్నారు. కార్యక్రమంలో ఆమె తనయుడు కౌశిక్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కొంపల్లి అనంతరెడ్డి, కొత్త నర్సింహారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు జయవంత్, సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు కోట్ల నరోత్తంరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్‌లు డప్పు రాజు, రవూఫ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, సీనియర్ నాయకులు షేక్ మహబూబ్, కృష్ణారెడ్డి, శ్రీహరి యాదవ్, ఎంపీటీసీ మాజీ సభ్యులు మాణిక్‌రెడ్డి, శ్రీనివాస్, రవీందర్, నాయకులు అంజిరెడ్డి, గణేశ్ రెడ్డి, సురేందర్‌గౌడ్, తిరుపతిరెడ్డి, నర్సింహాగౌడ్, సంజీవరావు, అంజయ్యగౌడ్, అరవింద్, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.



మొయినాబాద్‌లో ఇంద్రారెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న సబితారెడ్డి

ముర్తుజగూడలో..

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని నక్కలపల్లి, ముర్తుజాగూడలో దివగంత ఇంద్రారెడ్డి విగ్రహాలకు నాయకులు, అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల సాధనకు పోరాటం

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్

షాబాద్: మే డే స్ఫూర్తితో కార్మికుల హక్కుల సాధనకు పోరాటం చేస్తామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మేడే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎనిమిది గంటల పని అమలుకు పోరాడిన అమరవీరులను స్మరించుకుంటూ కార్మికుల హక్కులకు నాంది పలికిన మేడేను జయప్రదం చేయాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని వాటి కోసం కార్మికులు ఐక్య ఉద్యమాలు నడపాలన్నారు. కనీస వేతనం నెలకు రూ.26వేలు ఇతర సదుపాయాలు కల్పించాలని, ఎనిమిది గంటల పని కొనసాగింపు కోసం ఉద్యమాలు చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికుల హక్కులను కలరాస్తోందని, 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చి కార్మికులను బానిసలుగా మార్చుతున్నారని మండిపడ్డారు. బడా కార్పొరేట్ల మేలు కోసం కార్మికుల పొట్టగొడుతూ శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల ఉపాధ్యక్షుడు నర్సింహ, గ్రామ పంచాయతీ యూనియన్ మండల కార్యదర్శి అర్జున్, ఉపాధ్యక్షులు రవి, సాయిలు, నర్సింలు, రత్నమ్మ, యాదమ్మ, లక్ష్మి, రమాదేవి, బాబయ్య, పగులయ్య, తదితరులు ఉన్నారు.



మేడే వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు